నేను చెన్నై వస్తే.. కొందరికి కడుపునొప్పి

- అవినీతిపరుల ఆటలు సాగనివ్వం
- రాష్ట్రంలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాల వినియోగం
- బీజేపీ బహిరంగ సభలో మోదీ ధ్వజం
- డీఎంకే పాలకులపై నిప్పులు చెరిగిన ప్రధానమంత్రి
- 'మోదీ' నినాదాలతో మార్మోగిన వైఎంసీఏ మైదానం



ప్రజలకు అభివాదం చేస్తున్న మోదీ

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 'నేను చెన్నై వస్తున్నానంటేనే కొందరికి కడుపు నొప్పి వస్తోంది. రోజురోజుకు ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణే దీనికి కారణం' అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ డీఎంకే పాలకులను ఎద్దేవా చేశారు. అవినీతిపరుల ఆటలు సాగనివ్వబోమని, అవినీతి సొమ్మును కక్కిస్తామని 'గ్యారెంటీ' ఇచ్చారు. తమ పార్టీని బలోపేతం చేస్తే నీతివంతమైన పాలన అందిస్తామని హామీనిచ్చారు. రోజురోజుకు రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతోందని, రాష్ట్ర బిడ్డల భవిష్యత్తుకు ఇది ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర బిడ్డల గురించే తన బాధంతానని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక వైఎంసీఏ మైదానంలో జరిగిన బీజేపీ బహిరంగసభలో పాల్గొన్న మోదీ మాట్లాడుతూ.. డీఎంకే పాలకులపై మరోమారు నిప్పులు చెరిగారు. "నాకు మొదటి నుంచీ తమిళనాడుతో అవినాభావ సంబంధముంది. ఇప్పుడు చెన్నైలో జరుగుతున్న బహిరంగ సభ చూస్తుంటే మా పార్టీకి పెరుగుతున్న ఆదరణ స్పష్టమవుతోంది" అన్నారు. దేశాభివృద్ధిలో తమిళనాడు, చెన్నైది కీలక పాత్ర అని, అందుకే మౌలిక సదుపాయాల కోసం వేలాది కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నామన్నారు. చెన్నై మెట్రో, చెన్నై విమానాశ్రయం వంటివెన్నో ప్రాజెక్టులను అభివృద్ధి చేశామని, చెన్నై - మదురవాయల్ కారిడార్ కోసం వేలాది కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నామన్నారు. "ఇటీవల పెద్ద తుఫాను వచ్చింది. దానివల్ల నగర ప్రజలంతా ఎన్నో నష్టపోయారు. కానీ డీఎంకే ప్రభుత్వం వారికి సహాయం చేయడానికి బదులు ఆ కష్టాల్ని పెంచేందుకు ప్రయత్నించింది. బాధితులకు సహాయం చేయడానికి బదులు మీడియా మేనేజ్‌మెంట్ చేశారు. ఇళ్లలో నీరు చేరితే... మీడియాతో మాత్రం అంతా బాగుందని చెప్పించారు. దీనిని వల్ల ప్రజల కష్టాలు వారికేమీ పట్టవని అర్థమైంది. బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వానికి ప్రజల కష్టనష్టాలు తెలుసు. అందుకే కరోనా సమయంలోనూ ప్రజలను ఆదుకునేందుకు అన్ని రకాలుగా శ్రమించింది" అని వివరించారు.

అవినీతి సొమ్మును కక్కిస్తాం

"మా ప్రభుత్వం తమిళనాడు అభివృద్ధికి కట్టుబడి వుంది. అందుకే మేం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. కానీ డీఎంకే పాలకులకు మాత్రం ఇది కడుపు మంటగా ఉంది. లక్షలాది కోట్ల రూపాయలు లబ్ధిదారులకు నేరుగా వెళ్తున్నాయని బాధ పడుతున్నారు. తాము దోచుకునేందుకు అవకాశం లేకుండాపోతోందని విలవిల్లాడిపోతున్నారు. అందుకే ఇక్కడి కుటుంబం బాధ పడుతోంది. మేం వారి అవినీతిని అడ్డుకోవడంతో.. కనీసం ఆ అభివృద్ధి పనుల క్రెడిట్ అయినా తమకు దక్కలేదే అని అల్లాడిపోతోంది. నేను డీఎంకే నేతలకు ఒక్కటే చెప్పదలచుకున్నా... తమిళనాడు ప్రజల డబ్బు మిమ్మల్ని దోచుకోనివ్వను. అంతేగాక ఇప్పటికే దోచుకున్న డబ్బును వసూలు చేసి తీరుతాం. ఆ అవినీతి డబ్బును కక్కిస్తాం. ఇది మోదీ హామీ. ఇది మోదీ గ్యారెంటీ" అంటూ బీజేపీ కార్యకర్తల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కుటుంబ పార్టీలు తమ భవిష్యత్తును మాత్రమే చూస్తాయని, కానీ తాను దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పని చేస్తారన్నారు. తాను పదవి చేపట్టకముందు దేశంలోని 18 వేల గ్రామాల్లో కరెంటు లేదని, కానీ ఇప్పుడా గ్రామాలన్నీ విద్యుత్ సరఫరాతో కళకళలాడుతున్నాయన్నారు. ఆత్మనిర్భర్‌లో భాగంగా కల్పాక్కంలో స్వదేశీ బ్లాస్టర్ ప్రారంభించామన్నారు.

ఇంటి నుంచే విద్యుదుత్పత్తి

"కొన్ని రోజుల క్రితం తమిళనాడులో గ్రీన్ హైడ్రోజన్ సెల్‌ను ప్రారంభించాం. అలాగే పలు చోట్ల విద్యుదుత్పత్తికి చర్యలు చేపట్టాం. కేంద్రప్రభుత్వం ద్వారా కోటి మంది కుటుంబాలకు 'ముఫ్త్ బిజిలీ' పథకం ప్రారంభించాం. ఇందుకోసం రూ.75 వేల కోట్లను వ్యయం చేస్తున్నాం. మీరంతా ఇంట్లోనే వుండి సౌరశక్తి విద్యుదుత్పత్తి చేపట్టగలరు. మీరు అదనపు విద్యుత్ ఉత్పత్తి చేస్తే కేంద్రం కొనుగోలు చేస్తుంది. అంటే ఇంట్లోనే వుండి విద్యుత్‌ను ఉత్పత్తి చేసి,దానిని విక్రయించడం ద్వారా డబ్బులు సంపాదించవచ్చు" అని ప్రధాని ప్రకటించారు.

కుటుంబమంటే అవినీతికి లైసెన్సా?

"డీఎంకే, కాంగ్రెస్ నేతల గురించి మీకు బాగా తెలుసు. వారికి ఫ్యామిలీ ఫస్ట్... కానీ మోదీకి నేషన్ ఫస్ట్. అందుకే వీరంతా నన్ను తిట్టడంలో కొత్త ఫార్ములా తీశారు. ఇందులో భాగంగా మోదీకి కుటుంబం లేదు అంటున్నారు. అంటే కుటుంబం ఉంటే అవినీతికి లైసెన్స్ దొరుకుతుందా? నేను ఇల్లు వదిలింది ఆస్తిపాస్తుల కోసం కాదు. నా దేశం కోసం. ఇదే నా కుటుంబం. 145 కోట్లమంది నా కుటుంబీకులు. అందుకే నేను వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నాను. దేశ రైతులు, పేదలు.. వీరంతా నా కుటుంబం. అందుకే నేను వారి సాధికారత కోసం కృషి చేస్తున్నాను. మేరా భారత్... మేరా పరివార్. అందుకే కన్నియాకుమారి నుంచి కశ్మీర్ దాకా ముక్త కంఠంతో చెబుతోంది 'మై హూ మోదీ పరివార్.. నాన్ దాన్ మోదీ కుటుంబం" అంటూ ప్రకటించారు. దీంతో సభ ఒక్కసారిగా 'మోదీ మోదీ.. అంటూ మారుమోగింది. కాంగ్రెస్, డీఎంకేతో పాటు వారితో కలిసిన పార్టీలు అవినీతిలో మునిగిపోయాయన్నారు. ఇలాంటి అవినీతిపరుల్ని సంరక్షించేవారికి సుప్రీంకోర్టు నేడు స్పష్టమైన తీర్పునిచ్చిందన్నారు. దీంతో ఇండియా కూటమి వారికి అవినీతికి పాల్పడడం తప్ప మరొకటి చేతకాదన్నారు. ఇలాంటివారివల్లనే వ్యవస్థలకు ముప్పు పొంచివుందన్నారు. కుటుంబ పార్టీలకు అహంకారం అధికమని, అందుకే వారు దేశాన్ని, ప్రజలను హీనంగా చూస్తారన్నారు. అందుకే ఈ రోజు సుప్రీంకోర్టు డీఎంకేకు చెందిన ఓ మంత్రిని మందలించిందని పరోక్షంగా మంత్రి ఉదయనిధి విషయాన్ని ప్రస్తావించారు. తమిళనాడులో డ్రగ్స్ వినియోగం పెరిగిందని, ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. "నాకు మీ భవిష్యత్తు తరాల గురించి బాధ వుంది. వారిని అప్రమత్తం చేయాల్సిన అవసరముంది. ఈ ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుంది. మీరు బీజేపీని బలపరిస్తే తమిళనాడులోనూ నీతివంతమైన, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేలా పాలన అందిస్తాం అని ప్రకటించారు. తమను ఆశీర్వదించడానికి భారీగా తరలివచ్చిన వారిని చూస్తే ఢిల్లీలోని ఏసీ గదుల్లో కూర్చుని కుట్రలు పన్నేవారికి కూడా నిద్ర పట్టదన్నారు.

రాష్ట్రప్రజలంటే ప్రత్యేక అభిమానం

- కేంద్ర మంత్రి మురుగన్

తమిళనాడు, తమిళ భాష, తమిళ ప్రజలంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక అభిమానం. ఏ దేశానికి వెళ్లినా తమిళనాడు భాష, సంస్కృతి, సంప్రదాయాల గురించి మాట్లాడుతున్నారు. ఇక నుంచి మనమంతా మోదీ కుటుంబం అని గుర్తెరగాలి.

మనది మోదీ కుటుంబం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గతంలో ఎన్నిమార్లు వచ్చినా ప్రస్తుత పర్యటన ప్రత్యేకమైనది. ఆయన తన కుటుంబాన్ని చూసేందుకు ప్రప్రథమంగా వచ్చారు. మాది మోదీ కుటుంబం. గోపాలపురం లాంటి కుటుంబంలాంటిది కాదు. లాలూ ప్రసాద్ యాదవ్, స్టాలిన్ కుటుంబం లాంటిది కాదు.రాబోయే పార్లమెంటు ఎన్నికలు అత్యంత ప్రధానమైనవి. మోదీ కుటుంబం నుంచి 400 మంది ఎంపీలుగా ఎన్నిక కానున్నారు. రాబోయే 25 ఏళ్లలో చేపట్టాల్సిన పథకాలపై ప్రధాని మోదీకి స్పష్టత ఉంది. రాబోయే 60 రోజులు ఎంతో ముఖ్యమైనవని.

ముగిసిన మోదీ పర్యటన

ఒక్కరోజు పర్యటన కోసం సాయంత్రం 3.30 గంటలకు చెన్నై చేరిన ప్రధాని మోదీ.. విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో కల్పాక్కంలోని అణు విద్యుత్ కేంద్రానికి వెళ్లారు. అక్కడ స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన బ్లాస్టర్‌ను ప్రారంభించిన అనంతరం తిరిగి విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా స్థానిక వైఎంసీఏ మైదానం చేరుకుని, అక్కడ బీజేపీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సభకు భారీగా కార్యకర్తలు హాజరవడం విశేషం.



సభకు హాజరైన జనం



చిల్లిగవ్వ ఇవ్వరు.. ఓట్లు అడుగుతారు

- ప్రధాని మోదీపై సీఎం స్టాలిన్ విమర్శలు
- 6నుంచి 'నీంగల్ నలమా' పథకం
- మైలాడుదురై కలెక్టర్ కార్యాలయం ప్రారంభం

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరోమారు విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలు ప్రకృతి విపత్తుల్లో చిక్కుకుని నష్టపోతే, వారిని ఆదుకునేందుకు నయాపైసా ఇవ్వని నరేంద్రమోదీ... సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో తన కుర్చీని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రజల ఓట్ల కోసం పదేపదే చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ మాటల గారడీకి రాష్ట్ర ప్రజలు మోసపోరన్నారు. అదే సమయంలో తన సారథ్యంలోని ద్రావిడ మోడల్ డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రతి ఒక్క సంక్షేమ పథకం అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి చేరుతుందా లేదా అని తెలుసుకునేందుకు ఈ నెల 6న 'నీంగల్ నలమా' (మీరు క్షేమమా) అనే పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్టు ప్రకటించారు. ఒక రోజు పర్యటన నిమిత్తం సీఎం స్టాలిన్ ఆదివారం రైలులో మైలాడుదురైకు చేరుకున్నారు. మైలాడుదురైలో రూ.114.48 కోట్లతో ఏడంతస్తుల్లో కొత్తగా నిర్మించిన కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత మైలాడుదురై, తిరువారూరు, నాగపట్టినం జిల్లాల్లో కొత్తగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, పూర్తి చేసిన ప్రాజెక్టులను ప్రారంభించారు. అంతేగాక వివిధ పథకాల కింద లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... ఉమ్మడి తంజావూరు జిల్లాలో మైలాడుదురై ఒక ప్రాంతంగా ఉండేదని, దీన్ని జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత డీఎంకే ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఇపుడు ప్రారంభించామన్నారు. మైలాడుదురై, తిరువారూరు, నాగపట్టినం, తంజావూరు జిల్లాల్లో రూ.655 కోట్లతో పూర్తి చేసిన అనేక అభివృద్ధి పనులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. తంజావూరు జిల్లాలో తిరువోణం కేంద్రంగా కొత్తగా రెవెన్యూ డివిజన్ సోమవారం నుంచి ప్రారంభమైందన్నారు అలాగే, 150వ ఏడాదిలోకి అడుగుపెట్టనున్న మైలాడుదురై పురపాలక సంఘానికి రూ.10 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మిస్తామన్నారు. మైలాడుదురై పార్కు అవెన్యూలో స్థలం ఎంపిక చేశామని, ఇక్కడ రూ.5 కోట్లతో గ్రంథాలయాన్ని నిర్మిస్తామన్నారు. ఈ నాలుగు జిల్లాల్లో రైతులకు, జాలర్లకు సమానంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.15 కోట్ల మంది మహిళలకు నెలనెలా రూ.1000 చొప్పున అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకం కింద 16 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారన్నారు. పుదుమైపెణ్ పథకం కింద 4.81 లక్షల మందికి నెలకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్టు చెప్పారు. గత రెండేళ్లలో 'నాన్ ముదల్వన్' అనే పథకం కింద 28 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామన్నారు. ఇంటికే విద్య పథకం కింద 24.86 లక్షల మంది చిన్నారులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఇటీవ రాష్ట్రం రెండు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొందన్నారు. వీటివల్ల నష్టపోయిన ప్రజలను రూ.6.40 కోట్లతో ఆదుకున్నామన్నారు. ఇక ఈ నెల 6న చెన్నైలో 'నీంగల్ నలమా' పథకం అమలులో భాగంగా తనతో పాటు మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు లబ్ధిదారులకు ఫోన్ చేసి, ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని అభిప్రాయాలను సేకరిస్తామన్నారు.

ఎన్నికలు వస్తే వరుస పర్యటనలు..

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో కొందరు నేతలు తరచూ రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని, వారు ఎవరో కొత్తగా తాను చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన బాధితులను, రైతులను ఆదుకునేందుకు రూ.37 వేల కోట్ల ఆర్థిక సాయం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేయగా, నయాపైసా ఇవ్వలేదన్నారు. కానీ, ఎన్నికలు సమీపించడంతో రాష్ట్రంలో వరుస పర్యటనలు చేస్తున్నారన్నారు. 'రాష్ట్ర ప్రజలను ఆదుకునేందుకు పైసా నిధులు ఇవ్వరు.. కానీ, తమ కుర్చీలను కాపాడుకునేందుకు మాత్రం ప్రజల ఓట్లు మాత్రం కావాలా?' అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి జిమ్మిక్కులకు ప్రజలు మోసపోరని, తమిళనాడు హక్కుల పరిక్షణ, తమిళనాడు రాష్ట్ర అభివృద్ధి కోసం మన ద్రావిడ మోడల్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులో వున్న శ్రీ పద్మావతి తాయారు ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సర్వభూపాల వాహనంపై, సాయంత్రం గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

పర్యావరణ పరిరక్షణ ధోరణిలో మహాభారత రచన

- మహా సహస్రావధాని మేడసాని మోహన్

అడయార్, మార్చి 4: పర్యావరణ పరిరక్షణ ధోరణిలో మహాభారత రచన జరిగిందని, నరుడు నారాయణుడిని ఎలా చేరుకోవాలో చెప్పేదే మహాభారతమని మహా సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో 'కవిత్రయ మహాభారతం వర్తమాన సమాజం: సమాలోచనం' అనే అంశంపై మూడురోజుల అంతర్జాతీయ సదస్సు సోమవారం ఉదయం స్థానిక మెరీనాలోని వర్సిటీ రజతోత్సవ ప్రాంగణంలో ప్రారంభమైంది. తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు ప్రారంభోత్సవంలో మేడసాని కీలకోపన్యాసం చేస్తూ... ధర్మబద్ధమైన కోరికలు ఉండాలని మహాభారతం మనకు స్పష్టం చేస్తోందని హితవు పలికారు. మహాభారతంలో భీష్ముడి పాత్ర ద్వారా మంచి మార్గంలో నడచుకోవడానికి కావాల్సిన ఎన్నో విషయాలు మనకు తెలియజెప్పారని వివరించారు. ఆచార్య విస్తాలి మాట్లాడుతూ... మహాభారతాన్ని ఎవరు ఏ కోణంలో చూస్తే ఆ కోణంలో విషయాలు గోచరిస్తాయని, అలాంటి మహాగ్రంథం ఎందరికో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... మహాభారతంలోని ప్రతి పాత్రా ఒక పార్శ్వాంశమన్నారు. కృష్ణుడు ఒక తత్వవేత్త అని, భారతంలో అనేక అంశాలు వికాస సూత్రాలేనన్నారు. విశిష్ట అతిథి, టీటీడీ చెన్నై సమాచారకేంద్ర సలహామండలి ఉపాధ్యక్షుడు కె.ఆనందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... నేటి ఏఐ, నానో టెక్నాలజీకి మూలాలు మహాభారతంలోనే ఉన్నాయని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక అతిథిగా హాజరైన జర్మనీలోని ఎస్ఆర్‌హెచ్ విశ్వవిద్యాలయ ప్రతినిధి గణేష్ తొట్టెంపూడి మాట్లాడుతూ... మహాభారతం నేటి యువతకు ఎంతో ఆదర్శనీయమన్నారు. గౌరవ అతిథి కందనూరు మధు మాట్లాడుతూ.. మహాభారతం 5 వేల సంవత్సరం క్రితం వచ్చినా, ఇప్పటికీ ఈ గ్రంథం నేటి సమాజానికి అన్వయించుకునేలా ఉంటుందన్నారు. సదస్సు నిర్వహణకు పూనుకున్న నిర్వాహకులను ఆత్మీయ అతిథి డాక్టర్ ఏపీ శివకుమారి అభినందించారు. మరో ఆత్మీయ అతిథి, ఆఫ్రికా నుంచి హాజరైన ప్రముఖ సైకాలజిస్ట్ ఆచార్య శ్రీదేవి శ్రీకాంత్ అంతర్జాలం ద్వారా మాట్లాడుతూ.. మహాభారతంలోని ప్రతి పాత్రా మనోవికాసానికి ప్రతీక అని, నేటి సమాజంలోని మనస్తత్వ విశ్లేషణ చేసుకోవడానికి వీలైనవేనన్నారు. మరో ఆత్మీయ అతిథి డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మహాభారతంలోని కాలానికి తగ్గట్టుగా మనం అందులోని విషయాలను అన్వయించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సదస్సు మంగళ, బుధవారాల్లోనూ కొనసాగనుంది.



ప్రముఖులకు సత్కారం

ప్రశాంతంగా ప్లస్ వన్ పరీక్షలు ప్రారంభం

- 8.19 లక్షల మంది విద్యార్థుల హాజరు



చెన్నైలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెరంబూర్, మార్చి 4: తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ప్లస్‌వన్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 8.19 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్రంలో ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు ఈనెల 1వ తేది నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 3,302 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7.94 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం ప్రారంభమైన ప్లస్‌వన్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 25వ తేది వరకు జరగనున్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 3,302 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 3.89 లక్షల మంది విద్యార్థులు, 4.30 లక్షల మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, ఒక్కో పరీక్షకు తగినన్ని సెలవులు ఉండేలా టైంటేబుల్ రూపొందించారు. పరీక్షా విధుల్లో 47,000 ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పరీక్ష ముగిసిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 154 స్ట్రాంగ్ రూంలకు జవాబు పత్రాలు తరలించారు. అలాగే, పరీక్షల్లో కాపీయింగ్, అభ్యర్థుల మార్పు తదితరాలు అడ్డుకోనేలా స్క్వాడ్ బృందాలు ఏర్పాటయ్యాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్ వసతితో పాటు విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే, అస్వస్థతకు గురయ్యే విద్యార్థులకు ప్రాథమిక వైద్యచికిత్సలు అందించేలా పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశారు.

సమాచార దర్శిని

8నుంచి చిదంబరంలో నాట్యాంజలి

పెరంబూర్, మార్చి 4: కడలూరు జిల్లా చిదంబరంలో 43వ నాట్యాంజలి వార్షికోత్సవాలు ఈ నెల 8వ తేది నుంచి ఐదు రోజులు జరుగనున్నాయి. ఆ సందర్భం గా కథక్, కూచిపూడి, నాటక్, మణిపురి తదితర నాట్య ప్రదర్శనలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

● కలైంజర్ వరల్డ్ మ్యూజియం

రేపటినుంచి సందర్శనకు అనుమతి

పెరంబూర్, మార్చి 4: కలైంజర్ వరల్డ్ మ్యూజియాన్ని ఈనెల 6వ తేది నుంచి ప్రజలు సందర్శించవచ్చు. ఈ మ్యూజియంను ప్రజలు వీక్షించేలా www. kalaignarulagam.org అనే వెబ్‌సైట్ పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఈ వెబ్‌సైట్‌లో ప్రజలు తమ పేర్లు నమోదు చేసుకొని ప్రవేశ టిక్కెట్టు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రకటన విడుదలైంది.

ఏఐసీటీఈ అంగీకారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 4: అఖిల భారత సాంకేతిక విద్యా కౌన్సిల్ (ఏఐసీటీఈ) అంగీకారం పొందేందుకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్, సాంకేతిక, మేనేజ్‌మెంట్ వంటి కోర్సుల నిర్వహణకు ఏఐసీటీఈ వద్ద విద్యాసంస్థలు అనుమతి పొందాలి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీబీఏ, బీసీఏ కోర్సుల నిర్వహణకు అంగీకారం పొందేందుకు ఇచ్చిన దరఖాస్తు సమర్పణ గడువు ఫిబ్రవరితో ముగిసింది. వివిధ కళాశాలల విజ్ఞప్తి మేరకు ఈ నెల 7వ తేది వరకు అవకాశం కల్పించారు.

రూ.88 లక్షలతో ఆధునిక ఫిష్ మార్కెట్

ఐసిఎఫ్, మార్చి 4: స్థానిక ఎలియట్స్ బీచ్ తీరంలో రూ.88 లక్షలతో ఆధునిక చేపల మార్కెట్ ఏర్పాటుకానుంది. వసతులు లేని చేపల దుకాణ సముదాయాలను చెన్నై కార్పొరేషన్ ఆధునీకరిస్తోంది. ఈ క్రమంలో, 'సింగార చెన్నై 2.0' పథకం కింద 1,249 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 102 చేపల దుకాణాల సముదాయాన్ని నిర్మించనున్నారు. టెండర్లు పూర్తికాగానే పను లు ప్రారంభిస్తామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

అనాథ విద్యార్థులకు నిధుల కేటాయింపు

ఐసిఎఫ్, మార్చి 4: ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 671 మంది విద్యార్థులకు రూ.4.98 కోట్లను కేటాయించినట్లు పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి కుమరగురుబరన్ తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుంచి ప్లస్ టూ వరకు చదివే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రమాదాల్లో మరణిస్తే రూ.75 వేలు ఆర్థికసాయం అందజేయనున్నారు. ఈక్రమంలో ఈ నిధులను ప్రభుత్వ సంస్థల్లో డిపాజిట్ చేసి అందులో లభించే వడ్డీ వారి విద్యా ఖర్చులకు వినియోగించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, మార్చి 4: ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో బాయిలర్ మరమ్మతుల కారణంగా 600 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో ఉన్న ఈ కేంద్రంలో మొదటి స్టేషన్‌లో 3 యూనిట్లలో తలా 210 మెగావాట్లు, రెండో స్టేషన్‌లో రెండు యూనిట్లలో తలా 600 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. రెండో స్టేషన్‌లోని మొదటి యూనిట్‌లో బాయిలర్ లీకేజీ కారణంగా ఆదివారం 600 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోయింది.

ముగిసిన రెండో విడత పక్షుల గణన

ఐసిఎఫ్, మార్చి 4: రాష్ట్రంలో రెండవ విడత పక్షుల గణన ముగిసింది. ప్రతి సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పక్షుల గణన జరుగుతుంది. ఆ ప్రకారం గత జనవరిలో చేపట్టిన గణనలో 6.80 లక్షల పక్షులను గుర్తించారు. ఈ నేపథ్యంలో, రెండో విడత గణన శని, ఆదివారాల్లో జరిగింది. సుమారు 800కు పైగా ప్రాంతాల్లో చేపట్టిన గణనలో వివిధ జాతులు పక్షులను గుర్తించామని, వివరాలు త్వరలో వెల్లడిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

పెరిగిన సౌరశక్తి విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, మార్చి 4: రాష్ట్రంలో సోలార్ విద్యుదుత్పత్తి పెరిగింది. రాష్ట్రంలో 7,426 మెగావాట్ల సామర్థ్యంతో సౌరశక్తి విద్యుత్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వర్షాలు లేని రోజుల్లో ప్రతిరోజు 3,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. గత నెల ఫిబ్రవరి 23వ తేది 4,920 మెగావాట్లు, ఈనెల 2వ తేది 5,223 మెగావాట్ల ఉత్పత్తి జరిగింది. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశమున్నట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

మొబైల్ యాప్ రూపకల్పనకు టెండరు

ఐసిఎఫ్, మార్చి 4: నగరంలో బస్సు, రైలు, మెట్రోరైళ్లలో ఒకే టిక్కెట్టుపై ప్రయాణించే మొబైల్ యాప్ రూపొందించేందుకు ట్రాన్స్‌పోర్ట్ గ్రూప్ టెండర్లు ఆహ్వానిస్తోంది. నగరంలో ప్రధాన రవాణా సౌకర్యాలుగా ఉన్న బస్సు, సబర్బన్, మెట్రోరైళ్లలో వేర్వేరు ఛార్జీలు, టిక్కెట్ల విధానాలు అమలులో ఉన్నాయి. ఒక చోట నుంచి మరో చోటుకు వెళ్లేందుకు ఈ మూడు విధానాల ద్వారా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, అన్ని రవాణా సేవల్లో ఒకే టిక్కెట్టు వినియోగించే పథకం త్వరలో అమల్లోకి రానుంది. ఇందుకోసం ప్రత్యేక యాప్ రూపకల్పనకు టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

కోయంబేడు మార్కెట్లో పార్కింగ్ ఏర్పాటు

ఐసిఎఫ్, మార్చి 4: స్థానిక కోయంబేడు మార్కెట్లో పార్కింగ్ ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి కూరగాయలు తరలించే వాహనాలు నిలిపేందుకు సరిపడా స్థలం లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించేలా 19,000 చదరపు అడుగుల స్థలంలో రూ.75 లక్షలతో పార్కింగ్ వసతి ఏర్పాటు చేస్తున్నారు.

డిగ్రీ టీచర్ల పదోన్నతి

ఐసిఎఫ్, మార్చి 4: ప్రభుత్వ పాఠశాల డిగ్రీ టీచర్ల పదోన్నతికి సంబంధించిన జాబితా ఈనెల 15వ తేది లోపు అందజేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధుల్లో చేరి 2023 డిసెంబరు 31 లోపు అర్హతలు పొందిన పంచాయతీ యూనియన్, మున్సిపాలిటీ, కార్పొరేషన్, ప్రభుత్వ ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల జాబితా ఆధారంగా డిగ్రీ టీచర్ పోస్టులకు పదోన్నతి కల్పించనున్నారు. దీనికి సంబంధించిన జీవో గత ఏడాది డిసెంబరు 21వ తేది పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఆ ప్రకారం, అర్హులైన వారి జాబితాను ఈ నెల 15వ తేదిలోపు పంపాలని జిల్లా విద్యాధికారులకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

చెన్నై-కువైట్ మధ్య అదనపు విమానాలు

ఐసిఎఫ్, మార్చి 4: చెన్నై విమానాశ్రయం నుంచి కువైట్ మధ్య అదనపు విమాన సేవలు ప్రారంభమయ్యాయి. ఎయిర్ ఇండియా, ఇండిగో, కువైట్ ఎయిర్‌లైన్స్, జాకీరా ఎయిర్‌లైన్స్ అనే నాలుగు సంస్థలు చెన్నై నుంచి కువైట్‌కు విమానాలు నడుపుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సంస్థ ఆదివారం కువైట్ కొత్త ప్యాసింజర్ విమానసేవలు ప్రారంభించింది. ఈ విమానం మంగళ, శనివారాలు మినహా వారంలో ఐదు రోజులు సాయంత్రం 6.50 గంటలకు చెన్నై నుంచి బయల్దేరి అర్ధరాత్రి కువైట్ చేరుకుంటుంది.

మోదీకి నల్లజెండాలతో స్వాగతం

● 150 మంది కాంగ్రెస్ కార్యకర్తల అరెస్ట్

పెరంబూర్, మార్చి 4: నగరంలో సోమవారం పర్యటించిన ప్రధాని మోదీకి నల్లజెండాలతో నిరసన తెలపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. స్థానిక సైదాపేటలోని పనగల్ మాలిగై సమీపంలో ఉదయం 11 గంటలకు టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తంగబాలు నేతృత్వంలో నిరసన ప్రదర్శన నిర్వహించేందుకు అనుమతులు కోరగా పోలీసులు నిరాకరించారు. భద్రతా కారణాలతో ప్రదర్శనలో పాల్గొననున్న ప్రముఖ నేతల ఇళ్ల వద్ద ఆదివారం రాత్రి నుంచే పోలీసులు మోహరించారు. అడయార్‌లో ఉన్న తంగబాలు, నుంగంబాక్కంలో ఉన్న కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ విభాగ అధ్యక్షుడు రంజన్‌కుమార్, పోరూర్ కారంబాక్కంలో ఉన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దళపతి భాస్కర్, నాయకులు రాజ్యలక్ష్మి, నీలవన్, వినోద్, జిల్లా అధ్యక్షులు ఢిల్లిబాబు, ఎంఎస్ ద్రవియం, ముత్తళగన్ సహా పలువురిని పోలీసులు ఇళ్ల వద్దే నిలిపివేశారు. దీంతో వారు పోలీసుల కళ్లుగప్పి పనగల్ మాలిగై వద్దకు చేరుకొని ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిబంధనలు అతిక్రమించి ఆందోళన చేపట్టిన టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తంగబాలు, ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సెల్వం సహా 150 మందిని పోలీసులు అరెస్ట్ చేసి గిండిలోని కల్యాణ మండపానికి తరలించారు.



నిరసన ప్రదర్శనలో తంగబాలు, ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్, నేతలు, కార్యకర్తలు

17వ శతాబ్దం నాటి శిలాశాసనం లభ్యం



ఐసిఎఫ్, మార్చి 4: శివగంగ జిల్లా కాళయార్ ఆలయ సమీపంలో గరుమనేందల్ ప్రాంతంలో 17వ శతాబ్దానికి చెందిన శిలాశాసనాన్ని కారైకుడి అళగప్ప విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు గుర్తించారు. ఆ గ్రామానికి సమీపంలో ఉన్న శివాలయానికి భూములు దానం చేసినందుకు గుర్తుగా ఈ శిలాశాసనాన్ని ఏర్పాటుచేసి ఉంటారని, త్రిశూలం గుర్తు వేసి ఉన్న ఈ శాసనంలో సేతుపతి రాజులు చేసిన దానాల గురించి ప్రస్తావించబడినట్లు పరిశోధకులు తెలిపారు.

ఉత్తమ పాఠశాలలకు 'అన్బళగన్' పురస్కారాలు

ఐసిఎఫ్, మార్చి 4: ఉత్తమ ఉపాధ్యాయులకు 'ప్రొఫెసర్ అన్బగళన్' పురస్కారాలు అందజేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, బోధన విధానం, మౌలిక వసతుల కల్పన ఆధారంగా ప్రతి జిల్లాలో రెండు పాఠశాలలను ఎంపిక చేసి ఈ పురస్కారాలు ప్రదానం చేయనుంది. ఉత్తమ పాఠశాలల ఎంపిక పనులు త్వరలో ప్రారంభించనున్నారు.

తర్పణం, పిండ ప్రదాన పూజలకు రుసుము

● ప్రకటన ఉపసంహరణ

పెరంబూర్, మార్చి 4: రామేశ్వరం అగ్నితీర్థంలో పరిహార పూజలకు ఛార్జీలు వసూలు చేయాలనే ప్రకటన ఉపసంహరించుకుంటున్నట్లు ఆయన అధికారులు ప్రకటించారు. రామేశ్వరం రామనాథస్వామి ఆలయానికి వచ్చే భక్తులు, తమ పితృదేవతల ఆత్మలు శాంతించాలని కోరుతూ, అగ్నితీర్థం సమీపంలో అర్చకుల ద్వారా తర్పణం, పిండ ప్రదాన పూజలు చేయిస్తుంటారు. ఈ పూజలు చేసినందుకు అర్చకులకు భక్తులు తమకు తోచిన ఆర్థిక సాయం అందిస్తుంటారు. ఈ నేపథ్యంలో, తర్పణం, పిండ ప్రదాన పూజలకు రుసుము వసూలు చేయనున్నట్లు ఇటీవల హిందూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ తీరును అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా పలు పార్టీల నేతలు ఖండించారు. ఈ క్రమంలో, నిర్వాహక కారణాల రీత్యా ఈ ఉత్తర్వులు ఉపసంహరించుకుంటున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

మెట్రో రైల్వేస్టేషన్లలో 'మినీ మాల్స్'

వేళచ్చేరి, మార్చి 4: ఆదాయం పెంచుకొనేలా చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మెట్రో రైల్వేస్టేషన్ల సమీపంలో వాణిజ్య కాంప్లెక్సులు, మినీ మాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారి మాట్లాడుతూ... నెహ్రూ పార్కు సమీపంలో 5,264 చ.మీ విస్తీర్ణంలో 9 అంతస్తులతో కూడిన వాణిజ్య సముదాయం, సైదాపేట రైల్వేస్టేషన్‌లో సొరంగంలో రెండతస్తులతో కూడిన భవనం, అరుంబాక్కం రైల్వేస్టేషన్‌లో 7 అంతస్తులతో కూడిన భవనం నిర్మించనున్నామన్నారు. వీటిలో గేమింగ్ సహా పలురకాల వినోద కార్యక్రమాలు, వాణిజ్య దుకాణాల సముదాయంతో కూడిన మినీ మాల్స్‌లా పనిచేస్తాయని ఆయన తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, మార్చి 4: కాట్పాడి తాలూకాకు చెందిన 542 మంది లబ్ధిదారులకు రూ.4.73 కోట్ల విలువైన ఉచిత ఇళ్ల పట్టాల పంపిణీ సోమవారం జరిగింది. కాట్పాడీలోని కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ పాల్గొని, లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇల్లు లేకుండా ఎవరూ ఉండరాదనే లక్ష్యంతో కరుణానిధి గృహ నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన అనంతరం 8 లక్షల కాంక్రీట్ గృహాలు నిర్మించి అందిస్తామన్నారు. వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అమ్ములు, ఈశ్వరప్పన్, కార్పొరేషన్ మేయర్ సుజాత పాల్గొన్నారు.

అన్నాడీఎంకే ఆందోళన


ఆందోళనలో అన్నాడీఎంకే శ్రేణులు

వేలూరు, మార్చి 4: రాష్ట్రంలో మాదకద్రవ్యాల చెలామణి అడ్డుకోలేని డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. కార్యక్రమానికి వేలూరు మానగర్ జిల్లా సెక్రటరీ అప్పు అధ్యక్షత వహించగా, పార్టీ ఐటీ వింగ్ మండల సెక్రటరీ సతీష్‌కుమార్ ధర్నా ప్రారంభించారు. నగర జిల్లా సెక్రటరీ వేల్‌అయగన్, నిర్వాహకులు మణి, దాస్, ఎస్సీ రాజా, సంపత్, బాబు, కలిన్‌జార్ రామమూర్తి, సత్తువాచేరి రాఘవన్, 500 మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశిమేడులో ఒక్కసారిగా పెరిగిన చేపల ధరలు

అడయార్, మార్చి 4: స్థానిక కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో చేపల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. సాధారణంగా వారాంతపు రోజుల్లో చేపల విక్రయాలు అధికంగా ఉంటాయి. కానీ, సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన జాలర్లు తీరానికి అతి తక్కువ సంఖ్యలో తిరిగి వచ్చారు. దీంతో చేపలు తక్కువగా ఉండగా, విక్రయాల డిమాండ్ అధికంగా ఉండటంతో వీటి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఫలితంగా వంజరం కిలో రూ.1000 పలికింది. అలాగే, కరుప్పు వాల్వాల్ రూ.700, శంకర రూ.400, నండు రూ.350, రొయ్యలు రూ.450, షిలా రూ.350, కిళింగా రూ.400, పార్రై రకం రూ.400 చొప్పున ధర పలికింది.

మురుగన్ సహా ముగ్గురిని శ్రీలంకకు అనుమతించండి

● హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వినతి

వేళచ్చేరి, మార్చి 4: మురుగన్ సహా ముగ్గురిని శ్రీలంకకు పంపేందుకు అనుమతించేలా కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టులో రాష్ట్రప్రభుత్వం అఫిడివిట్ దాఖలు చేసింది. అస్వస్థతకు గురై తన తల్లిని పరామర్శించేందుకు తనను శ్రీలంకకు పంపాలని శాంతన్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు సురేష్‌కుమార్, కుమరేశ్‌బాబుతో కూడిన ధర్మాసనం విచారించగా ప్రభుత్వం తరఫున... అనారోగ్యంతో శాంతన్ మృతిచెందినట్లు, అందుకు సంబంధించిన పత్రాలు దాఖలు చేశారు. అనంతరం శాంతన్ మృతదేహాన్ని శ్రీలంకకు పంపించాలని ఆదేశించాలని ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు, అందుకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. ఈ కేసు సోమవారం మళ్లీ విచారణకు రాగా, శాంతన్ మృతదేహాన్ని శ్రీలంకకు తరలించినట్లు రాష్ట్రప్రభుత్వం తరపున అఫిడవిట్ దాఖలైంది. దీంతో, శాంతన్ కేసు విచారణ ముగిసినట్లు ధర్మాసనం ప్రకటించింది. అదే సమయంలో రాజీవ్ హత్యకేసులో విడుదలై శ్రీలంక తమిళ శరణార్థుల శిబిరాల్లో ఉన్న మురుగన్, రాబర్ట్ పయాజ్, జయకుమార్ తమను శ్రీలంకకు పంపించాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖలు రాశారని రాష్ట్రప్రభుత్వం తెలియజేసింది. ఈ ముగ్గురు శ్రీలంకకు పంపించేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్రప్రభుత్వం కోరింది. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అడ్వొకేట్ జనరల్.. లేఖలు రాసిన ముగ్గురు తమకు సంబంధించిన సర్టిఫికేట్లు అందజేయాలని, శ్రీలంక దౌత్యకార్యాలయాన్ని సంప్రదించారా? అనే విషయం తెలియడం లేదని తెలిపారు. వాదనల అనంతరం, ముగ్గురి వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని తెలిపిన ధర్మాసనం, వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేస్తే పరిశీలిస్తామని తెలిపింది.

రంజాన్ సందర్భంగా 7,040 టన్నుల బియ్యం

● సీఎం ఉత్తర్వులు

ప్యారీస్, మార్చి 4: రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు చేపట్టిన ఇస్లామీయులు తీసుకొనే గంజి తయారీ కోసం మసీదులకు పచ్చి బియ్యం అందజేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... మసీదులకు అవసరమైన బియ్యం పొందేందుకు నిర్వాహకులు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఆ ప్రకారం, 7,040 మెట్రిక్ టన్నుల బియ్యం అందించనున్నట్లు, అందువల్ల ప్రభుత్వానికి రూ.26,81,53,600 అదనపు ఖర్చు అవుతుందని సచివాలయం తెలియజేసింది.

అరుంధతీయులకు రిజర్వేషన్లు పెంచాలి

● ఎమ్మార్పీఎస్ డిమాండ్


సభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ప్యారీస్, మార్చి 4: విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో అరుంధతీయులకు రిజర్వేషన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. స్థానిక పులియాంతోపులోని జైన్ భవన్‌లో ఆదివారం సాయంత్రం ఎమార్పీఎస్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఎమ్మార్పీఎస్ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు లోకేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పాల్గొని, దేశంలోని పలు రాష్ట్రాల్లో అరుంధతీయులకు కేటాయిస్తున్న రిజర్వేషన్లు, వారి జీవనస్థితులను వివరించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎస్టీ కల్యాణ సుందరం, అరంగ పెరుమాళ్, కరివలం మురుగన్, పుల్లాపురం కె.కుమార్, కోవై కుయిలి చిత్ర, రాధ, పార్వతి పాల్గొని, రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టాల్సిన ఉద్యమాల గురించి వివరించారు. ఎన్.ఆనందరావు ఆహ్వానం పలికిన ఈ సమావేశంలో ఎం.ఎం.కొండయ్య, బి.వసంతరావు, రాష్ట్ర నిర్వాహకులు ఇ.దేవదాస్, ఎం.బాలాజి, ఇ.నాగభూషణం, కేఆర్‌పి ప్రభాకర్, టి.గోపి, నారాయణన్, న్యాయవాదుల విభాగం నిర్వాహకులు ఎం.మహేష్‌వీరన్, ఇ.భాస్కర్, కేఆర్ సురేష్, ఎ.దినేష్, జిల్లా నిర్వాహకులు ఇ.వెంకటేష్, జి.నాగేష్ (ఉత్తర చెన్నై), మేక బాబు (మధ్య చెన్నై), జీసీ రవిరాజ్ (దక్షిణ చెన్నై), ఎస్.చిన్నకాళి (తిరుపత్తూర్), డి.రాజ్‌కుమార్ (రాణిపేట), రాజేష్ (వేలూరు), వీఆర్ మురుగన్ (కృష్ణగిరి), మావీరన్ బాబు (తిరువళ్లూర్) సహా 100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. డీవై శ్రీనివాసన్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

శ్రీపెరుంబుదూరు లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ పోటీ చేయాలి

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై

అడయార్, మార్చి 4: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ శ్రీపెరంబుదూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై కోరారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రాష్ట్రంలో పర్యటిస్తూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నెల్లై, కన్నియాకుమారి, మదురై జిల్లాల నిర్వాహకులతో భేటీ అయ్యేందుకు ఆయన సోమవారం చెన్నై నుంచి విమానంలో తూత్తుక్కుడికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే కూటమిలో కాంగ్రెస్ పార్టీ పటిష్ట బంధంతో ఉందన్నారు. కానీ, అన్నాడీఎంకే నేతలు కాంగ్రెస్ పార్టీని తమ వైపునకు తిప్పుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారన్నారు. కానీ, తాము గత ఐదు ఎన్నికల్లో డీఎంకేతో కలిసి పోటీ చేశామని తెలిపారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో కూడా డీఎంకే కూటమి తరపునే పోటీ చేస్తామని తెలిపారు. అదేసమయంలో తమ పార్టీ అగ్రనేత రాహుల్ శ్రీపెరుంబుదూరు నుంచి పోటీ చేయాలని ఆయన కోరారు. బీజేపీ పదేళ్ల క్రితం యేడాదికి 2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ, ఈ హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా బీజేపీ అమలు చేయలేదని ఆయన విమర్శించారు.

రూ.180 కోట్ల మాదకద్రవ్యాలు స్వాధీనం

చెన్నై దంపతులకు 15 రోజుల రిమాండ్

పెరంబూర్, మార్చి 4: నగరం నుంచి సెంగోట్టైకు వెళ్లే పొదిగై ఎక్స్‌ప్రెస్ రైల్లో మాదకద్రవ్యాలు తరలిస్తున్నట్లు కేంద్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో, ఢిల్లీ నుంచి బయల్దేరిన బిల్లమాన్ ప్రకాష్‌ను అధికారులు అనుసరించారు. అనంతరం పొదిగై ఎక్స్‌ప్రెస్ ఎక్కిన అతను మదురై రైల్వేస్టేషన్‌లో దిగిన సమయంలో అధికారులు అతన్ని బంధించారు. అతని బ్యాగులను తనిఖీ చేయగా, వాటిలో 30 కిలోల మాదకద్రవ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రకాష్‌ను మదురై రైల్వే పోలీసులకు అప్పగించారు. రైల్వే పోలీసులు అతని వద్ద చేపట్టిన విచారణలో... చెన్నై కన్నదాసన్ నగర్‌కి చెందిన వాడని, అతన్ని సంప్రదించిన జేసుదాస్ అనే వ్యక్తి మాదకద్రవ్యాలు మదురైకి తీసుకురావాలని కోరినట్లు తెలిసింది. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యం విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.180 కోట్లు అని తెలిసింది. అదే సమయంలో, మరో 6 కిలోలు చెన్నై కొడుంగైయూర్‌లోని ఇంట్లో ఉంచినట్లు అతను తెలిపాడు. దీంతో పోలీసులు ఆ ఇంట్లో తనిఖీలు చేపట్టి కుప్పతొట్టె అడుగు భాగంలో దాచి ఉంచిన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రకాష్ భార్య మోనీషా షీలాను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ నిమిత్తం చెన్నై నుంచి మదురైకి తీసుకెళ్లారు. ఆదివారం ఆమెను విచారించారు. అదే సమయంలో ఈ వ్యవహారంతో సంబంధాలున్న జేసుదాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాష్, ఆయన భార్య మోనీషాను మదురైలోని మాదకద్రవ్యాల నిరోధక విభాగం కోర్టు న్యాయమూర్తి హాజరుపరచి, న్యాయమూర్తి ఉత్తర్వులతో వారిద్దరిని 15 రోజుల రిమాండ్ నిమిత్తం చెన్నై పుళల్ జైలుకు తరలించారు.


అరెస్టయిన దంపతులు

ఏప్రిల్ 4కు సెంథిల్ బాలాజి కేసు వాయిదా

పెరంబూర్, మార్చి 4: రవాణా శాఖలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ నగదు మోసానికి పాల్పడ్డారంటూ సెంథిల్ బాలాజిపై కేంద్ర నేరవిభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం సెంథిల్ బాలాజి సహా 47 మందిపై నమ్మకద్రోహం, మోసం చేయడం, హత్యా బెదిరింపు తదితర సెక్షన్లపై కేసు నమోదైంది. ఈ కేసు సోమవారం ప్రత్యేక న్యాయస్థానం విచారించింది. ఆ సమయంలో కేంద్ర నేరవిభాగం తరపున హాజరైన న్యాయవాది... సెంథిల్ బాలాజిపై మోసం కేసులో అదనపు చార్జిషీట్ దర్యాప్తు అనుమతి కోసం సమ్మతి లేఖ ఇంకా అందలేదన్నారు. అదనపు చార్జిషీటులో ప్రభుత్వ అధికారులు, రవాణా శాఖ ఉద్యోగులు అని సుమారు 900 మంది ఉండడంతో అనుమతులు లభించడంలో జాప్యం జరిగిందని తెలిపారు. కేసు విచారణకు సంబంధించిన అనుమతులతో కూడిన లేఖ రాష్ట్రప్రభుత్వం నుంచి ఇంకా అందలేదని కేంద్ర నేర విభాగం తెలిపింది. దీంతో, తదుపరి విచారణ ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

రిమాండ్ పొడిగింపు...

మాజీ మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను ఈనెల 6వ తేది వరకు న్యాయమూర్తి అల్లీ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పుళల్ జైల్లో ఉన్న సెంథిల్ బాలాజి రిమాండ్ గడువు సోమవారం ముగియడంతో ఆయన్ను జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, ఆయన రిమాండ్ 23వ సారి పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

18కి పొన్ముడి కేసు వాయిదా

పెరంబూర్, మార్చి 4: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో విధింపబడిన శిక్షకు వ్యతిరేకంగా పొన్ముడి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారించిన న్యాయమూర్తులు, శిక్ష విధించిన తీర్పు నిలిపివేయాలా అంటూ ప్రశ్నించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారంటూ పొన్ముడి, ఆయన భార్యపై నమోదైన కేసులో, ఇరువురికి తలా మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, పొన్ముడి తన మంత్రి పదవి కోల్పోయారు. ఈ నేపథ్యంలో, ఈ కేసులో విధించిన శిక్షను వ్యతిరేకిస్తూ పొన్ముడి సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని విచారించిన న్యాయమూర్తులు... శిక్షా తీర్పు నిలిపివేయాలా? అంటూ ప్రశ్నించారు. అనంతరం కేసు సంబంధించి అదనపు వివరాలు, తీర్పు వివరాలు దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసి, తదుపరి విచారణ ఈ నెల 18వ తేదీకి వాయిదా వేశారు.

ఒకట్రెండు రోజుల్లో పొత్తులు ఖరారు

● దురైమురుగన్

అడయార్, మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం డీఎంకే కూటమిలోని మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపు ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లో పూర్తవుతుందని రాష్ట్ర మంత్రి దురైమురుగన్ తెలిపారు. ఇదే విషయంపై ఆయన వేలూరులో మాట్లాడుతూ... మదురైలో ఎయిమ్స్‌ను బీజేపీ నేతలు తీసుకొచ్చారని, ఆ ప్రాజెక్టును వారే పూర్తి చేయాలని, ఈ అంశంపై తమపై నిందారోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ఎయిమ్స్ పూర్తికాకుండా డీఎంకే అడ్డుకుంటోందని అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. అన్నాడీఎంకే మాజీ అధినేతల ఫొటోలను బీజేపీ నేతలు ప్రచారానికి వాడుకుంటున్నారని, ఈ విషయంలో అన్నాడీఎంకే నేతలకే కోపం, రోషం రావాలని ఆయన అన్నారు.

ప్రధాని రాక ఎలాంటి ఫలితాలివ్వదు...

మాజీ మంత్రి జయకుమార్

పెరంబూర్, మార్చి 4: ప్రధాని మోదీ రాష్ట్రంలో తరచూ పర్యటించడం వల్ల బీజేపీ పార్టీకి ఎలాంటి ఫలితాలివ్వదని అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ స్పష్టం చేశారు. స్థానిక వళ్లువర్‌కోట్టంలో సోమవారం ధర్నా అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే కూటమిలో లుకలుకలు చోటుచేసుకున్నాయన్నారు. అవి బయటపడకుండా పడరాని పాట్లు పడుతున్నారని, చిన్న పార్టీలకు సీట్లు కేటాయించినా, డీపీఐ, కాంగ్రెస్ పార్టీలకు సీట్ల కేటాయింపు జరగక పోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. అన్నాడీఎంకే కూటమి ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. 2016, 2014 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన చరిత్ర అన్నాడీఎంకేకు ఉందన్నారు. బీజేపీతో జతకట్టే అవకాశం లేదని ఇదివరకే స్పష్టం చేశామని, రాబోయే ఎన్నికల్లో మెజార్టీ విజయాలు సాధిస్తామని జయకుమార్ అన్నారు.

హిజ్రాల వివరాలు సేకరించండి

పెరంబూర్, మార్చి 4: హిజ్రాల సంఖ్యపై పూర్తి వివరాలు సేకరించేలా చర్యలు చేపట్టాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. విద్య, ఉపాధి రంగాల్లో హిజ్రాలకు రిజర్వేషన్ కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ సోమవారం విచారించిన న్యాయస్థానం, రాష్ట్రంలో ఎంతమంది హిజ్రాలున్నారు, వారి విద్యార్హతలు, ఆర్థిక స్థితి తదితరాల వివరాలు సేకరించి నివేదిక దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రేమించి పెళ్లి చేసుకున్న యువజంట ఆత్మహత్య

అడయార్, మార్చి 4: వేలూరు జిల్లా కీళ్ కృష్ణరాయపురం పంచాయతీ, ఈస్ట్ కాలనీకి చెందిన పూవరసన్ (25), ఐశ్వర్య (20) మూడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా, వారిద్దరూ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఐశ్వర్య స్నేహితురాలి నిశ్చితార్థం పల్లికొండలో జరిగింది. ఈ కార్యక్రమానికి తీసుకెళ్లాలని భర్తను కోరగా, అందుకు ఆయన నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన ఐశ్వర్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త.. విషం తాగి ప్రాణాలు తీసుకున్నాడు.

ప్రైవేటు మీటర్ల మరమ్మతులకు సంబంధం లేదు

● విద్యుత్ బోర్డు

వేళచ్చేరి, మార్చి 4: వినియోగదారులు కొనుగోలు చేసిన విద్యుత్ మీటర్లు మరమ్మతులకు గురైతే తమకెలాంటి సంబంధం లేదని విద్యుత్ బోర్డు స్పష్టం చేసింది. కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి విద్యుత్ బోర్డు మీటరును అందిస్తుంది. ఈ నేపథ్యంలో, విద్యుత్ మీటర్ల కొరత ఉంది. అదే సమయంలో అవసరమైతే వినియోగదారులు ప్రైవేటు కంపెనీల మీటర్లు కొనుగోలు చేయవచ్చని ఈబీ తెలిపింది. ఈ నేపథ్యంలో, తాజాగా విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ప్రైవేటు సంస్థల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్ మీటర్లు మరమ్మతులకు గురైతే తమకెలాంటి సంబంధం లేదని పేర్కొంది.

రూ.290 కోట్ల తాగునీటి పన్ను వసూలు లక్ష్యం

ఐసిఎఫ్, మార్చి 4: ఈ నెలాఖరులోగా రూ.290 కోట్ల తాగునీటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చెన్నై మెట్రోవాటర్ బోర్డు నిర్దేశించుకుంది. నగరంలో 15 మండలాల్లో పైప్‌లైన్, ట్యాంకర్ల ద్వారా 100 కోట్ల లీటర్ల తాగునీరు ప్రతి రోజు వాటర్ బోర్డు సరఫరా చేస్తోంది. నగరంలో 9.91 లక్షల తాగునీరు, మురుగునీటి కనెక్షనుండగా, ఏడాదికి పన్ను, ఇతర ఛార్జీలు రూ.892 కోట్ల ఆదాయం వస్తోంది. గృహాలకు పన్నుగా వార్షిక ఆస్తి విలువలో 7 శాతం (రూ.80) తాగునీటి పన్నుగా వసూలు చేస్తున్నారు. వాణిజ్య భవనాలకు ఈ పన్ను మారుతుంది. మొత్తం 13.96 లక్షల మంది పన్ను, 9.13 లక్షల మంది ఇతర రుసుములు చెల్లిస్తున్నారు. తాగునీటి కనెక్షన్ లేని విస్తరణ ప్రాంతాల్లో పన్ను మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో, 2023-34 ఆర్థిక సంవత్సరంలో రూ.892 కోట్లు, 2022-23 వరకు బకాయిలు రూ.365 కోట్లు కలిపి రూ.1,257 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇందులో రూ.900 కోట్లు వసూలు కాగా, మిగిలిన రూ.357 కోట్లు బకాయిలు. దీనిలో రూ.290 కోట్లు ఈ నెలాఖరులోగా వసూలు చేసేలా తాగునీటి బోర్డు లక్ష్యం నిర్ధేశించింది.

కోవై, చెన్నై పాఠశాలలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, మార్చి 4: కోవై, చెన్నైలోని ప్రైవేటు పాఠశాలలకు గత వారం బాంబు బెదిరింపు వచ్చిన నేపథ్యంలో, మళ్లీ బెదిరింపులు రావడం కలకలం రేపింది. స్థానిక మాంగాడు సమీపం కెరుగంబాక్కంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు సోమవారం ఉదయం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు మెసేజ్ వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులకు బయటకు పంపి, పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. ఈ వార్త దావానంలా వ్యాపించడంతో తల్లిదండ్రులు హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకొని తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. అలాగే, కోయంబత్తూర్ వడవల్లిలో ఓ ప్రైవేటు పాఠశాలకు ఆదివారం అర్ధరాత్రి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు రావడంతో, సోమవారం ఆ పాఠశాలకు సెలవు ప్రకటించగా, పోలీసులు తనిఖీలు చేపట్టారు.

సీబీసీఐడీకి బదిలీ...

ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వ్యవహారాన్ని సీబీసీఐడీకి బదిలీ చేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. గత నెలలో నగరంలోని 13 పాఠశాలలకు ఇలాగే ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. గుర్తుతెలియని ఈ-మెయిల్ చిరునామా గుర్తించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ ఇంటర్‌పోల్ సాయం తీసుకుంది. ఈ బెదిరింపు విదేశాల నుంచి వచ్చినట్లు తెలిసి, దాని చిరునామా కోసం అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా రెండు నగరాల్లోని పాఠశాలలకు బాంబు బెదిరింపు మెసేజ్ రావడంతో ఈ వ్యవహారాన్ని సీబీసీఐడీకి బదిలీ చేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది.

‘కాడువెట్టి’ కుల విద్వేష చిత్రం కాదు


● హీరో ఆర్‌కే సురేష్



‘కాడువెట్టి’ సినిమా ఆడియో రిలీజ్ దృశ్యం

తాను హీరోగా నటించిన ‘కాడువెట్టి’ చిత్రం కుల విద్వేష చిత్రం కాదని ఆర్‌కే సురేష్ అన్నారు. అలాగే తాను సినిమాలు, రాజకీయాలను విడిచి వెళ్లనని స్పష్టం చేశారు. ‘కాడువెట్టియార్’, ‘కాడువెట్టి గురు’, ‘కాడువెట్టి’ అనే పదాలు రాష్ట్రంలో వివాదాస్పద పదాలుగా గుర్తింపు పొందాయి. కానీ, ఆర్‌కే సురేష్ ‘కాడువెట్టి’ అనే టైటిల్‌తో సినిమాను తెరకెక్కించారు. సోలై ఆర్ముగం దర్శకుడు. శ్రీకాంత్ దేవా సంగీతం అందించారు. ఈ సినిమా ఆడియో, ట్రైలర్ విడుదల వేడుక ఆదివారం చెన్నైలో జరిగింది. ప్రముఖ దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్, మోహన్ జీ, ప్రముఖ స్టంట్ మాస్టర్ జాగ్వార్ తంగం తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌కే సురేష్ మాట్లాడుతూ... ‘ఇటీవల నా గురించి పలు రకాలుగా దుష్ప్రచారం చేశారు. చిత్ర పరిశ్రమలో 15 యేళ్లుగా కొనసాగుతున్నా. 100కు పైగా చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేశా. 40 చిత్రాల్లో నటించా. ప్రతి ఒక్క రాజకీయ నేతతోపాటు కుల సంఘాల నేతలతో పరిచయం, స్నేహ సంబంధాలున్నాయి. అయితే నా గురించి అనేక అపోహలు కలిగేలా వార్తలు రాశారు. రాష్ట్రవ్యాప్తంగా నాకు అభిమానులున్నారు. అందుకే రాజకీయాలు, సినిమాలను విడిచి వెళ్లను. ఈ సినిమాలో నాకు లభించిన పాత్రను పోషించినందుకు గర్వంగా ఉం ది. కాడువెట్టి గురు కుటుంబానికి ఒక విషయం చెబుతు న్నా. ఈ సినిమా మీ కుటుంబానికి ఎంతో మంచి పేరు తెస్తుంది. మిమ్మల్ని గర్వపడేలా చేస్తుంది. ఇది ఎమోషనల్ సినిమా. ఇది ఏ ఒక్క కులానికి సంబంధించిన సినిమా కాదు. నేను ఏ కులాన్ని దూషించడం లేదు’ అని పేర్కొన్నారు. అలాగే, ముఖ్య అతిథులతో పాటు సంగీత దర్శకుడు శ్రీకాంత్ దేవా, యూనిట్ సభ్యులు ప్రసంగించారు. మంజల్ స్క్రీన్స్ బ్యానర్‌పై నిర్మాత టి.సుభాష్ చంద్రబోస్, కె.మహేంద్రన్, ఎన్.ఎమ్. హేంద్రన్, సి.పరమశివం, జి.రాము సోలై ఆర్ముగం సంయుక్తంగా నిర్మించారు. మా.పుగళేంది సినిమాటోగ్రఫర్.

రాజు మురుగన్ దర్శకత్వంలో అర్జున్‌దాస్?



అర్జున్‌దాస్

హీరో అర్జున్‌దాస్ ప్రముఖ దర్శకుడు రాజుమురుగన్ దర్శకత్వంలో నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. అర్జున్‌దాస్ తాజాగా నటించిన ‘పోర్’ సినిమా పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. అదేసమయంలో రాజు మురుగన్ తన తదుపరి ప్రాజెక్టుపై దృష్టి సారించారు. కార్తీ హీరోగా తెరకెక్కించిన ‘జపాన్’ భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను నిరాశపరిచింది. దీంతో రాజుమురుగన్ హిట్ కొట్టాలన్న కసితో ఉన్నారు. రాజు మురుగన్ ‘కుక్కూ’ చిత్రం ద్వారా మెగాఫోన్ పట్టారు. ఆ తర్వాత ఆయన రూపొందించిన ‘జోకర్’ సినిమాలోని రాజకీయ డైలాగులు, సెటైర్లు పాపులర్ అయ్యాయి. సినిమా కూడా సూపర్‌హిట్ అయ్యింది. ఆ తర్వాత విడుదలైన చిత్రాలు ‘జిప్సీ’, ‘జపాన్’ నిరాశనే మిగిల్చాయి. దీంతో తన తదుపరి ప్రాజెక్టును సక్సెస్‌ఫుల్‌గా తీర్చిదిద్దేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. ఇందులో అర్జున్‌దాస్‌ను హీరోగా ఎంపిక చేయాలని ఆయన భావిస్తున్నారు. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

చిత్రజ్యోతి


రెహ్మాన్ స్వరకల్పనలో శ్రుతిహాసన్ నేపథ్యగానం



ఏ.ఆర్.రెహ్మాన్‌తో శ్రుతిహాసన్, స్నేహన్, కృతిక

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు విజేత ఏ.ఆర్.రెహ్మాన్ స్వరకల్పనలో ప్రముఖ నటి శ్రుతిహాసన్ ఒక పాటకు నేపథ్యగానం చేశారు. హీరో ఉదయనిధి సతీమణి కృతిక దర్శకత్వంలో ‘కాదలిక్క నేరమిల్లై’ అనే చిత్రం తెరకెక్కుతోంది. జయం రవి, నిత్యా మేనన్ జంటగా నటిస్తున్నారు. యోగిబాబు, డీజే బాను, జాన్ కొక్కెన్ తదితరులు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. రెడ్ జెయింట్ మూవీస్ బ్యానరుపై నిర్మించే ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం సమకూర్చుతున్నారు. ఈ సినిమా కోసం గేయ రచయిత స్నేహన్ రచించిన పాటను శ్రుతిహాసన్ ఆలపించగా, ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. కాగా, ఇదే పేరుతో 1964లో శ్రీధర్ దర్శకత్వంలో ఓ చిత్రం రాగా, అది సూపర్‌హిట్ అయింది. ఇపుడు ఇదే టైటిల్‌తో కృతిక రొమాన్స్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మేలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆగస్టులో విజయ్ ‘గోట్’ విడుదల?



‘గోట్’లో విజయ్

వెంకట్ ప్రభు దర్శకత్వంలో అగ్రహీరో విజయ్ నటిస్తున్న కొత్త చిత్రం ‘ది గోట్’ (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైం). ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చే ఈ చిత్రంలో మోహన్, జయరాం స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి, ప్రభుదేవా, ప్రశాంత్, అజ్మల్ తదితరులు నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. చిత్రీకరణ పనులు మరో నెల రోజుల్లో పూర్తికానున్నాయి. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్ నిర్మాణ పనులు పూర్తి చేసి, విజయ్ బర్త్‌డే గిఫ్టుగా జూన్‌లో విడుదల చేయాలని తొలుత ప్లాన్ చేశారు. కానీ, కోలీవుడ్ వర్గాల తాజా సమాచారం మేరకు స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 15న విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.

కోలాహలంగా జల్లికట్టు



ఎద్దును అదుపుచేస్తున్న యువకులు

పెరంబూర్, మార్చి 4: ధర్మపురి సమీపం చోకత్తూర్‌లోని శక్తి మారియమ్మన్ ఆలయ ఉత్సవాలు యేటా వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాల్లో భాగంగా జల్లికట్టు పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం 8 గంటలకు జల్లికట్టు పోటీలను జిల్లా రెవెన్యూ అధికారి పాల్‌ప్రిన్సిలీ రాజ్‌కుమార్ ప్రారంభించారు. తొలుత ఆలయ ఎద్దు వాడివాసల్ నుంచి బయటకు రాగా దాన్ని ఎవ్వరూ అడ్డుకోలేదు. ఇక ఈ పోటీల్లో ధర్మపురి, సేలం, పుదుకోట, మదురై, కృష్ణగిరి సహా పలు జిల్లాలకు చెందిన 600 ఎద్దులు, వాటిని అణచేందుకు 300 మంది యువకులు పాల్గొన్నారు. వాడివాసల్ నుంచి రంకెలేస్తూ దూసుకొస్తున్న ఎద్దులను అణచేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ పోటీలను వీక్షించేందుకు వచ్చిన ప్రజలు, ఈలలు వేస్తూ, చప్పట్లు చరుస్తు వీరులను ఉత్సాహ పరిచారు. ఈ పోటీలో ఎవరికి చిక్కకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు, ఎక్కుం సంఖ్యలో ఎద్దులను అణచిన యువకులకు సైకిల్, మిక్సీ, ఫ్యాన్, నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 400 పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.

ఘనంగా కెవిన్‌కేర్ ఎబిలిటీ అవార్డుల ప్రదానం



చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశేష సేవలందించడంతో పాటు పలు రకాల ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన వారికి కెవిన్‌కేర్ సంస్థ ఎబిలిటీ అవార్డులను ప్రదానం చేసింది. ఇటీవల చెన్నైలో జరిగిన ఈ కార్యక్రమంలో ముంబైకి చెందిన డాక్టర్ కేత్నా ఎల్.మెహతా, బెంగళూరుకు చెందిన విద్యవై, ఢిల్లీకి చెందిన వినయన ఖురానా, సికింద్రాబాద్‌కు చెందిన ఐశ్వర్య టీవీ, న్యూఢిల్లీకి చెందిన చోంజిస్ ఆంగ్మో తదితరులకు ఎబిలిటీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీకే రంగనాథన్ మాట్లాడుతూ... ఎబిలిటీ అవార్డులు సంవత్సరానికి వికలాంగుల ఆత్మ, స్థితిస్థాపకతను జరుపుకుంటున్నాయన్నారు. యేటా సాధకులు సవాళ్లను జయించడంలో, అడ్డంకులను ఛేదించడంలో వారి అసాధారణమైన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతున్నారని కొనియాడారు. వారికి మంచి గుర్తింపు తెచ్చే వేదికగా తాము ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

అన్నానగర్‌లో ‘డాక్టర్ శోభా గిరీష్ గైనిక్ అండ్ ఈస్థటిక్ సెంటర్’



చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ టెంపుల్ వ్యూ కాలనీ 13వ మెయిన్‌రోడ్డులో ‘డాక్టర్ శోభా గిరీష్ గైనిక్ అండ్ ఈస్థటిక్ సెంటర్’ ఏర్పాటైంది. దీన్ని ప్రముఖ వైద్యుడు శ్రీవాత్సవ్ విజయ రాఘవన్ ఇటీవల లాంఛనంగా ప్రారంభించారు. ఈ కర్యాక్రమంలో డాక్టర్ శోభా గిరీష్ తదితరులు కూడా పాల్గొన్నారు. ఇప్పటికే ఆమె చెన్నై హెల్త్ ఫౌండేషన్, తేజా హాస్పిటల్ కన్సల్టెంట్‌గా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... డాక్టర్ శోభా గిరీష్ మహిళల ఆరోగ్యం పట్ల సమగ్ర విధానానికి కొత్త కోణాన్ని జోడిస్తున్నారని, మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల కేంద్రంగా రాష్ట్రం

● డీఎంకే పాలన నిరసిస్తూ అన్నాడీఎంకే ధర్నా



వళ్లువర్‌కోట్టం వద్ద జరిగిన ధర్నా

పెరంబూర్, మార్చి 4: రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం, అసాంఘిక శక్తుల అరాచకాలను అరికట్టడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందంటూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో సోమవారం అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ధర్నాలు జరిగాయి. ఇటీవల ఢిల్లీలో భారీస్థాయిలో పట్టుబడిన మాదకద్రవ్యాల వ్యవహారంలో అరెస్టయిన ముగ్గురిలో ఒకరు విల్లుపురం, మరొకరు చెన్నైవాసిగా గుర్తించారు. వీరు అందించిన సమాచారం మేరకు, మాదకద్రవ్యాల అక్రమ తరలింపు వెనుక సినీ నిర్మాత, డీఎంకే నాయకుడు జాఫర్ సాధిక్ ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, జాఫర్ సాధిక్ అజ్ఞాతంలోకి వెళ్లగా, ఢిల్లీ నుంచి వచ్చిన మాదకద్రవ్యాల తరలింపు నిరోధక విభాగం అధికారులు ఆయన ఇంట్లో తనిఖీలు చేపట్టి, ఇంటికి నోటీసులు అంటించారు. అలాగే, జాఫర్ సాధిక్ విదేశాలకు పారిపోకుండా లుకౌట్ నోటీసు జారీచేశారు. ఈ క్రమంలో, గుజరాత్ సముద్రంలో పట్టుబడిన రూ.2,000 కోట్ల మాదకద్రవ్యాలు తమిళనాడుకు తరలిస్తున్నట్లు విచారణలో తెలిసింది. ఈ ఘటన అనంతరం మదురై రైలులో రూ.180 కోట్ల విలువైన మాదకద్రవ్యం పట్టుబడింది. ఈ ఘటనల వెనుక జాఫర్ సాధిక్ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన అనంతరం జాఫర్ సాధిక్‌ను డీఎంకే తమ పార్టీ నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలో, మాదకద్రవ్యాలకు నిలయంగా రాష్ట్రం వ ా రిం ద ని, వీటిని అరికట్టడంలో డీఎంకే ప్రభుత్వం విఫ ల వె ౖ ం ద ని అన్నాడీ ఎంకే సహా ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అదే సమయంలో, రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించి ప్రజలు భయాందోళనలతో జీవిస్తున్నారని ప్రతిపక్ష నేత పళనిస్వామి విమర్శించారు. మాదకద్రవ్యాల చెలామణి నిరోధించడం, శాంతి భద్రతలు పర్యవేక్షించడంలో డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ సోమవారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించారు. స్థానిక వళ్లువర్‌కోట్టం వద్ద జరిగిన ధర్నాలో పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు డి.జయకుమార్, గోకుల ఇందిర, జిల్లా కార్యదర్శులు ఎస్.బాలగంగా, ఆదిరాజారామన్, విరుగై వీఎన్ రవి, టీజీ వెంకటేశ్‌బాబు సహా పలువురు నేతలు, పార్టీ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, చెంగల్పట్టు రాటిన్‌కినరు ప్రాంతంలో మాజీ మంత్రి పి.వలర్మతి, తిరువళ్లూర్ ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో మాజీ మంత్రి పి.బెంజిమెన్ నేతృత్వంలో జరిగిన ధర్నాల్లో ఆయా జిల్లాల కార్యదర్శులు, ముఖ్య నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని, డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

‘లింఫెడెమా’పై అవగాహన వారోత్సవాలు



చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రిలో ‘లింఫెడెమా’ అవగాహన వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను ఆసుపత్రి ఎండీ కనకవల్లి షణ్ముగనాథన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాతీ య ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.మరుదురై, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి రాజసభాపతి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్స్ అధ్యక్షుడు వెంకటరమణి తదితరులు పాల్గొన్నారు. శోషరసం తక్కువగా ఉత్పత్తి అయ్యే కారణంగా పుట్టుకతో వచ్చే సమస్యల కారణంగా అవయవాలలో వాపు పెరగడంతో రోగులకు ఇబ్బందిగా మారుతుంది. దీని గురించి ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందని వైద్యులు పేర్కొన్నారు.

ఓపీఎస్, దినకరన్‌తో బీజేపీ చర్చలు

వేళచ్చేరి, మార్చి 4: నగరంలో సోమవారం ప్రధాని మోదీ పర్యటన బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఆ ఉత్సాహంతో రాబోయే ఎన్నికల్లో కూటమి ఏర్పాటు చర్చలు ఆ పార్టీ తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్‌తో కూటమి ఏర్పాటు, సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపనున్నారు. ఇప్పటికే బీజేపీ నేతృత్వంలోని కూటమిలో జీకే వాసన్ నేతృత్వంలోని తమిళ మానిల కాంగ్రెస్, ఏసీ షణ్ముగం (పుదియ నీతి కట్చి), పారివేందర్ (ఐజేకే), జాన్‌పాండియన్ నేతృత్వంలో పార్టీ చేరాయి. అదే సమయంలో కూటమిలో చేరేందుకు ఓపీఎస్, దినకరన్ ఉవ్విళ్లూరుతున్నారు. ఓపీఎస్ ఐదు స్థానాలు, దినకరన్ 22 స్థానాలతో కూడిన జాబితా అందజేసి కనీసం 12 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. వారికి అన్ని సీట్లు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేదని తెలుస్తోంది. అందువల్ల ప్రధాని ఇటీవల పాల్గొన్న పల్లడం, నందనం బహిరంగ సభల్లో వీరు పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో, సోమవారం నగర పర్యటన సందర్భంగా మోదీ సూచనలతో మరోసారి ఓపీఎస్, దినకరన్‌తో చర్చలు జరపాలని బీజేపీ రాష్ట్ర నేతలు నిర్ణయించినట్లు తెలిసింది.

సనాతన ధర్మం నిర్మూలనకు ఆంగ్లేయుల యత్నం

● గవర్నర్ రవి



పుస్తకావిష్కరణలో గవర్నర్ రవి

అడయార్, మార్చి 4: దేశంలో సనాతన ధర్మం నిర్మూలనకు ఆంగ్లేయుల ఎంతో ప్రయత్నించారని రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయ్యా వైకుంఠర్ 192వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని మహావిష్ణువు అవతారమైన శ్రీవైకుంఠస్వామి ఆశీర్వాద సనాతన చరిత్ర అనే పుస్తకాన్ని సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ‘అంగ్లేయులు తమ పాలనలో సనాతన ధర్మాన్ని నిర్మూలించేందుకు కృషి జరిగిందన్నారు. రామేశ్వరం, కాశీ వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు యావత్ దేశానికి చెందినవన్నారు. సనాతనం అనేది ప్రతి ఒక్కరికీ సమానం. అందరం సమం అని పేర్కొంటుంది. దేశంలో అనేక భాషలు, పలు రకాలైన ఆహార పద్ధతులు, సంస్కృతీ సంప్రదాయాలు ఉన్నప్పటికీ మనమంతా కలిసి మెలిసి ఐక్యంగా నివసించడమే సనాతన ధర్మమన్నారు. ద్రావిడం గురించి రాబర్ట్ కాల్డ్‌వెల్ రాసిన పుస్తకం నకిలీదన్నారు. జీయూ పోప్ దేశంలో మతతత్వం పెంపొందించేలా ప్రచారం చేశారని, క్రైస్తవులకు, బైబిల్‌కు తాము వ్యతిరేకం కాదన్నారు.

జాఫర్ సాధిక్‌పై నిఘా ఎందుకు పెట్టలేదు

బీజేపీ చీఫ్ అన్నామలై ప్రశ్న

అడయార్, మార్చి 4: సినీ నిర్మాత జాఫర్ సాధిక్‌పై పోలీసులు ఎందుకు నిఘా పెట్టలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై ప్రశ్నించారు. ఆయన కోయంబత్తూరు విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ... 2013లో 20 కిలోల డ్రగ్స్ కలిగి ఉన్నాడన్న ఆరోపణల నేపథ్యంలో జాఫర్ సాధిక్‌తో పాటు మొత్తం నలుగురిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. 11 యేళ్ల తర్వాత ఆయన విశ్వరూపం చూపించి ఏకంగా 3,500 కిలోల మాదకద్రవ్యాలతో పట్టుబడ్డారని గుర్తు చేశారు. సాధారణంగా ఒకసారి డ్రగ్స్ కేసులో పట్టుబడితే ఆ వ్యక్తిపై పోలీసులు నిఘా వేసి ఉంచుతారని కానీ, జాఫర సాధిక్ విషయంలో ఎందుకు ఎందుకు పెట్టలేదన్నారు. కారణం, ఆయన సినీ నిర్మాత కావడంతో పాటు సీఎం స్టాలిన్ కుటుంబ సభ్యులతో సంబంధాలు కలిగి ఉండడమే కారణమన్నారు.

343 స్థానాల్లో ‘ఇండియా’ కూటమి విజయం

● మంత్రి అన్బిల్ మహేష్

వేళచ్చేరి, మార్చి 4: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ‘ఇండియా’ కూటమి 343 స్థానాల్లో విజయం సాధించి అధికారం చేపడుతుందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ధీమా వ్యక్తం చేశారు. నామక్కల్‌లో జరిగిన తమిళ పులిగళ్ మహానాడులో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... అరుంధతీయ వర్గాల కోసం దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పలు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఉద్యోగావకాశాల్లో 3 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ఈ రిజర్వేషన్లు ఎత్తివేసేలా బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 2019 నుంచి తెలంగాణ, ఆంధ్ర, ఢిల్లీ, జార్ఖండ్, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో అటు లోక్‌సభ, ఇటు శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి పరాజయం తప్పడం లేదన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలపై ఈడీ, ఐటీ, సీబీఐ సంస్థలను వినియోగిస్తే, ఆ మూడు సంస్థలను నమ్ముకొని బీజేపీ ఎన్నికలకు వెళుతోందని మంత్రి విమర్శించారు.

ఘనంగా ‘ఎయిడ్’’ స్నాతకోత్సవం



చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ‘అమెరికన్ అకాడమీ ఆఫ్ ఇంప్లాంట్ డెంటిస్ట్రి’ (ఎయిడ్) 19వ స్నాతకోత్సవంతో పాటు 20వ బ్యాచ్ ప్రారంభోత్సవం ఇటీవల చెన్నైలో ఘనంగా జరిగింది. నగరంలోని ఓ హోటల్లో జరిగిన ఈ వేడుకల్లో ఇండియన్ డెంటల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ దిబ్యేందు మజుందార్, తమిళనాడు అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి, జీఎస్ఐపీయూ వైస్‌చాన్సలర్ డాక్టర్ మహేష్ వర్మ తదితరులు అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో ఇంకా డాక్టర్ శంకర్ అయ్యర్, డాక్టర్ మహేష్ వర్మ, అమెరికన్ అకాడమీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బాలాజీ సుబ్రహ్మణ్యం వంటి ప్రముఖులు పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులకు పంచారు.

అపోలోలో ఫ్యాటీ లివర్ క్లినిక్



చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో ప్రసిద్ధి చెందిన ‘అపోలో లివర్ డిసీజెస్ అండ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఇనిస్టిట్యూట్‌లో ‘ఫ్యాటీ లివర్ క్లినిక్’ ఏర్పాటైంది. దీన్ని ప్రముఖ నటుడు ప్రశాంత్ సోమవారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశంలో ఫ్యాటీ లివర్ అతివేగంగా ఆరోగ్య సమస్యగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలేయంపై కొవ్వు పేరుకుపోవడం భారతీయ జనాభాలో గణనీయమైన భాగాన్ని ప్రభావితం చేస్తోందని అధ్యయనాలు చెబుతున్నాయని గుర్తు చేశారు. దీన్ని అడ్డుకునేందుకు అపోలో ఫ్యాటీ లివర్ క్లినిక్‌ను ప్రారంభించామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ‘ఫైబ్రోస్కాన్ ఎక్స్‌పర్ట్ 630’ అనే డయాగ్నొస్టిక్ కాలేయ సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తెచ్చి నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌ని దీటుగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఆసుపత్రి సీనియర్ హెపటాలజిస్ట్ డాక్టర్ ఎన్.మురుగన్ తదితరులు పాల్గొన్నారు.